# చిట్టి కథ - ప్రకృతి స్పందన

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు

పద్మపురంలో నివసించే ధర్మయ్యకు ఐదెకరాల భూమి వుంది. వర్షాలు పడి చెరువులు నిండగానే ఆనందంతో వరి విత్తనాలు జల్లాడు. పొలం దున్ని నీరు కట్టి వరినాట్లు వేయించాడు.

పొలంలో పని జరుగుతున్నంతసేపూ 'ఈ ఏడు పంట బాగా పండాలి. ధాన్యంతో గాదెలు నిండాలి. అవి అమ్మిన ధనంతో పాత బాకీలు తీరుస్తాను. పిల్లలకి మంచి బట్టలూ, భార్యకి నగలు చేయిస్తాను. ఇంకా ధనం మిగిలితే రాబోయే కాలానికి కొంత దాచుకుంటాను' అని అనుకున్నాడు. భార్యకి కూడా తన మనసులోని మాట చెప్పాడు. ఆవిడ కూడా సంతోషించింది. పంట చేను బాగా పెరగాలని ఎరువులు జల్లాడు. పక్షులు తినకుండా పశువులు పాడు చెయ్యకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. తన ఏర్పాట్లకి తప్పకుండా మంచి దిగుబడి వస్తుందని ఆశగా ఎదురు చూశాడు.

అయితే అతడనుకున్నట్టుగా జరగలేదు. పంట ఒక మోస్తరుగా పండింది. పాత అప్పులు తీర్చడానికే సరిపోయింది. తన పొలంలో దిగుబడి తగ్గడం ధర్మయ్యకు ఆశ్చర్యం వేసింది.

'ఈ ఏడాది కురిసిన వర్షాలకు మంచి దిగుబడి వస్తుందనుకున్నాను. ఇలా జరిగిందేమిటి' అనుకుని బాధపడ్డాడు ధర్మయ్య. అతడిని ఓదార్చింది ధర్మయ్య భార్య. ఏడాది గడిచింది. మళ్ళీ వర్షాకాలం వచ్చింది. విత్తులు నాటారు. పొలంలో ఉడుపులు ప్రారంభించారు.

అప్పుడు ధర్మయ్య భార్య ధర్మయ్యతో 'గతసారి మీరు అనుకున్నట్టు జరగలేదు. ఈసారి పూర్తిగా దేవుడి మీద భారం వేసి మన ఇంటి కోసం మాత్రమే కాకుండా ఊళ్ళో అందరికోసం ప్రార్థించండి. మనం మాత్రం బాగుంటే చాలదు. ఊరంతా బాగుండాలి. మనసులో మాటిమాటికీ అదే అనుకోండి' అని సలహా ఇచ్చింది.

'అలాగే' అన్నాడు ధర్మయ్య.

www.sirimalle.com

ఈసారి ఒక మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. చాలీ చాలని వర్షాలు కాబట్టి పంట మీద ఆశలు వదిలేసి దేవుణ్ణి తలచుకొని మదుపులు పోను తిండికి మిగిలితే చాలనుకున్నాడు ధర్మయ్య.

పొలంలో ఉన్నంతసేపూ భార్య మాటలు గుర్తొచ్చేవి. 'దిగుబడి బాగుంటే ఊళ్ళోని పేదవాళ్ళకి అన్న సంతర్పణ చేస్తాను. బడిలో చదివే అనాధలకి తిండి గింజలు పంపిస్తాను. గ్రామ దేవత కోవెలకి చందాలు పంపిస్తాను' అని అనుకున్నాడు.

పంటకోతలు చేసి నూర్పులు అయిన తరువాత ధాన్యం ఇంటికి చేరాయి. సరిగ్గా పండదేమో అనుకున్న భూమి మీద ఊహించనంత ఎక్కువ దిగుబడి వచ్చింది. అది చూసి ధర్మయ్య ఆశ్చర్యపోయాడు.

ధర్మయ్య మనసులో మాటలు దేవుడు ఆలకించాడా అన్నట్లు అతడికి గాలిలో కొన్ని మాటలు వినబడ్డాయి. 'గత ఏడాది నువ్వు పూర్తిగా నీ గురించే కోరావు. పక్షులనీ, పశువుల్నీ తిననీయలేదు. నీ స్వార్థం చూసి నీకు ప్రకృతి సాయపడలేదు. ఈ సారి అందరి మేలు కోరుకున్నావు. మంచి మనసుతో ప్రవర్తించావు. ప్రకృతి మాత సంతోషించి తన వంతు సహకారం అందించింది. మంచి మనసుతో మనుషులు చేసే పనులకి ప్రకృతి, దైవం పూర్తి సహకారం అందిస్తారని ఇప్పటికైనా గ్రహించు' అని చెప్పి ఆగిపోయాయి.

తన తప్పు తెలుసుకున్న ధర్మయ్య ప్రతి ఏటా తన పొలంలో పండిన పంటలో కొంతభాగం దానధర్మాలకి కేటాయించడం మొదలు పెట్టాడు.

(నాని సౌజన్యంతో )